ప్రజాశక్తి
గురువారం 3 ఆగస్టు 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

జగనన్నా.. పింఛను కానుక ఏదన్నా..

◆ కొత్త వాటికి మోక్షం ఎప్పుడో.. ◆ రెండు నెలలైనా రాని సొమ్ము ◆ ఎదురుచూస్తున్న అర్హులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, అనకాపల్లి, బుచ్చెయ్యపేట విలేకరులు

ఏడాదికి రెండుసార్లు వివిధ కేటగిరీలకు పింఛన్లు మంజూరు చేస్తామని హామీనిచ్చిన ప్రభుత్వం మాట తప్పింది. ఈ ఏడాది జూన్ నుంచి ఇవ్వాల్సిన వైఎస్ఆర్ పెన్షన్ కానుక సొమ్ము నేటికీ అర్హులకు అందలేదు. ఈ ఏడాదిలో జనవరి నుంచి మే వరకు దరఖాస్తు చేసుకున్న వేలాది మంది పింఛన్లకు అర్హతపొందారు. వారందరికీ జులై నుంచి పింఛన్ సొమ్ము చెల్లించాలి. ఈ క్రమంలో జూన్ పింఛన్ జులైలో ఇవ్వకపోయినా జులై పింఛన్ ఆగస్టులో ప్రభుత్వం చెల్లిస్తుందని వారంతా భావించారు. కానీ నిరాశే ఎదురైంది. రెండు నెలల పింఛన్ రాని అర్హులంతా సచివాలయాల దగ్గరకు వెళ్లి మంజూరుకాలేదని తెలిసి నిరాశతో వెనుదిరగడం పలుచోట్ల కనిపించింది.



జిల్లాలో 2,56,437 మంది వివిధ రకాల పింఛన్లు పొందుతున్నారు. ఈ క్రమంలో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలు, వికలాంగులు, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు,

మిగతా 2లో..



ఈమె బుచ్చెయ్యపేట మండలం, నేతవానిపాలేనికి చెందిన వియ్యపు దేవుడమ్మ, ఆమె భర్త అప్పారావు ప్రమాదవశాత్తు చెరువులో పడి 2022 అక్టోబర్ 24న మరణించాడు. వితంతు పింఛన్ కోసం అప్పటి నుంచీ దరఖాస్తు చేస్తూనేవుంది. కూలి పనులు చేసుకొని బతుకుతున్న దేవుడమ్మకు ఎనిమిది నెలలవుతున్నా పింఛన్ మంజూరు కాలేదు.



ఈయన అనకాపల్లి మండలం, తుమ్మపాలకు చెందిన గొంతిన వెంకటరావు. 57 శాతం అంగవైకల్యం వున్నట్లు ధృవీకరణపత్రం వుంది. పుట్టినప్పటి నుంచి ఎడమచేతి వేళ్లు పూర్తిగా ఆయనకు లేవు. తుమ్మపాల వీధిలో చిన్న కిరాణా దుకాణం పెట్టుకొని జీవిస్తున్నాడు. ఆయన అనేకసార్లు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరుకాలేదు.



పాత నగరంలో జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రజలు

147 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ

పింగళి వెంకయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య 147వ జయంతి సందర్భంగా పాత నగరంలోని స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం 147 అడుగుల భారీ జాతీయ జెండాతో ర్యాలీ చేపట్టారు. సంస్థ కార్యాలయం నుంచి రాణి బొమ్మ వరకూ నిర్వహించిన ఈ ర్యాలీకి సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ జహీర్ అహ్మద్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలన్నారు. అలాగే పార్లమెంట్‌లో వెంకయ్య విగ్రహాన్ని ప్రతిష్టించాలని కోరారు. సూరాడ అప్పారావు, సత్తిబాబు, పాతబ్బాయి పాల్గొన్నారు.

సమస్యలపై విద్యుత్ ఉద్యోగుల ధర్నా

▶ వార్త 2లో..

ఓటర్ల జాబితా సవరణపై సమీక్ష

▶ వార్త 2లో..

అమృత్ భారత్‌తో రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ

▶ వార్త 2లో..

నేడు నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-విశాఖపట్నం

జివిఎంసి 3, 5, 8వ జోన్ పరిధిలో పలు ప్రాంతాలకు గురువారం తాగునీటికి అంతరాయం కలుగుతుందని జివిఎంసి పర్యవేక్షక ఇంజనీరు కె వేణుగోపాల్ తెలిపారు. గవరపాలెం వద్ద భారీ వర్షాలకు గండిపడిన జివిఎంసి రైవాడ మంచినీటి సరఫరా పథకం ద్వారా దేవరాపల్లి నుంచి నరవకు నీటి సరఫరా చేసే ఓపెన్ కెనాల్‌కు మరమ్మతులు కారణంగా గురువారం 3వ జోన్ 14, 24, 26వ వార్డులలో డాక్టర్స్ కాలనీ, ఏపీ ఎస్ఇబి కాలనీ, ఎంఎంటిసి కాలనీ, అంబేద్కర్ నగర్, ఇందిరా గాంధీ బొమ్మ లైన్, చైతన్య నగర్, కనకమ్మ టెంపుల్, కెప్టెన్ ఏరియా, గాంధీనగర్, శారద స్కూలు, ఓల్డ్ కోపరేటివ్ బ్యాంకు, క్రాంతి నగర్, ఎన్ హెచ్-16 రోడ్డు, లలిత నగర్, రామకష్ణ నగర్, 80 అడుగుల రోడ్డు, ఎన్జిజిఓఎస్ కాలనీ, చిన్నూరు, మంగళ వీధి ప్రాంతాల్లోనూ, 5వ జోన్ లో 44, 46, 47, 50, 51, 54, 57వ వార్డుల పరిధిలో గల మర్రిపాలెం, జ్యోతి నగర్, మహారాణి వీధి, బాపూజీ నగర్, మాధవధార వూడా లే అవుట్, మాధవధార, కళింగ నగర్, ఎన్జీవోఎస్ కాలనీ, పట్టాభిరెడ్డి తోట, సూర్య నగర్, సిద్ధార్థ నగర్, తుమ్మడి పాలెం, సుభాస్ నగర్, భవాని గార్డెన్, కస్తూరి నగర్ 1, శాంతినగర్-1, 2, సంజీవయ్య నగర్ హిల్ ఏరియా, బాపూజీ నగర్ 1, 2, అంబేద్కర్ ఎస్టేట్, సురేష్ రామ్ నగర్, పెద్ద కొత్తూరు హిల్ ఏరియా దిగువ భాగం, రాంజీ ఎస్టేట్, తిక్కవానిపాలెం కాలనీ, జై ప్రకాష్ నగర్, కప్పరాడ 1, 2, ఇందిరానగర్ 4 ,5, మహాత్మా గాంధీ నగర్, జవహర్లాల్ నగర్, ఏఎన్ఆర్ నగర్, శ్రీనివాస నగర్, పోలీస్ క్వాటర్స్, పలనాటి కాలనీ, గోకుల్ నగర్, గొల్ల కంచరపాలెం, దుర్గానగర్, అభిద్ నగర్, పోస్ట్ ఆఫీస్, గోలీల పాలెం, శ్రీనివాస్ నగర్, నందగిరి నగర్, చెక్కుడు రాయి బిల్డింగ్ ఏరియా, దాడి రామ్మూర్తి కల్యాణ మండపం అలాగే8వ జోన్ 92వ వార్డు పరిధిలోని శ్రీరామ నగర్, శ్రీను బాబు నగర్, అజంతా పార్క్, టైలర్స్ కాలనీ, ఉడా కాలనీ, పవర్ ఆఫీస్ ఎదురుగా, ఆర్ ఆర్ పురం, రజక కాలనీ ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు గమనిచాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల కన్నెర్ర

పర్మినెంట్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని విశాఖలో భారీ ర్యాలీ, సభ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సమస్యలపై జివిఎంసి కార్మికులు కన్నెర్రజేశారు. రాష్ట్ర మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) పిలుపు మేరకు బుధవారం జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులంతా పనులు నిలిపేసి జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిపిన సభకు యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు అధ్యక్షత వహించారు. వేలాది మంది కార్మికులనుద్దేశించి సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ఆలోగా సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్, నీటి సరఫరా కార్మికులకు స్కిల్డ్, సెమీస్కిల్డ్ జీతాలు, యుజిడి కార్మికులకు, వెటనరీ కార్మికులకు హెల్త్ అలవెన్సులు,

మిగతా 2లో..



నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వేలాది మంది పారిశుధ్య కార్మికులు

మొదటి పేజీ తరువాయి..

జగనన్నా.. పింఛను కానుక ఏదన్నా..

డప్పు, వృద్ధాప్య కళాకారులు, సాంప్రదాయ చెప్పులుకుట్టేవారికి జులై పింఛన్ కింద ప్రభుత్వం రూ.68.65 కోట్లు విడుదల చేసింది. ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి దరఖాస్తు చేసుకున్న 10 వేల మందిలో 9687 మంది అర్హత పొందినట్లు తెలిసింది. అయినా జూన్‌లో మంజూరు కావాల్సిన పింఛన్ సొమ్ము వీరెవరికీ రాలేదు. వృద్ధాప్య, వితంతు పింఛన్ పొందిన వారెవరైనా మృతి చెందితే వారి స్థానంలో అర్హత కలిగిన వారికి రెండు, మూడు నెలల్లో గతంలో పింఛన్ మంజూరయ్యేది. ప్రస్తుతం ఆర్నెళ్లకు ఒకసారి అర్హులకు పింఛన్ మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఆ ప్రకారం పింఛన్ మంజూరు కావడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. అర్హులకు త్వరలో పింఛన్లు మంజూరవుతాయని డిఆర్‌డిఎ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో పింఛన్‌కు అర్హత పొందినవారి వివరాలు	
వృద్ధాప్య పింఛన్లు	3792
వితంతు	40
ఒంటరి మహిళ	23
వికలాంగులు	1957
మత్స్యకారులు	221
డప్పు కళాకారులు	78
కల్లుగీత కార్మికులు	142
చేనేత కార్మికులు	4
సంప్రదాయ చెప్పులు కుట్టుకొనేవారు	46
ట్రాన్స్‌జండర్లు	–

మున్సిపల్ కార్మికుల కన్నెర్ర

మిగిలిన కేటగిరీలకు రిస్క్ అలవెన్సులు ఇవ్వాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18500 జీతం చెల్లించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 7న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని, 17న చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జి.అప్పారావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎంవి.ప్రసాదరావు, కార్యదర్శి జె.నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.రత్నం, ఎం.ఈశ్వరరావు, యుజిడి విభాగం నాయకులు ఇ.ఆదినారాయణ, నీటి సరఫరా విభాగం నాయకులు శంకర్ రెడ్డి, రాజశేఖర్, మీనాక్షి, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, సత్యవతి, గణేష్, నాలుగు వేల మందికిపైగా కార్మికులు పాల్గొన్నారు.

వైసిపివి నవ మోసాలు

ప్రజాశక్తి- కలెక్టరేట్ : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్నది నవరత్నాలు కాదు, అవి నవ మోసాలని టిడిపి దక్షిణ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ ఆరోపించారు. బుధవారం 27వ వార్డు ఎరుకుమాంబ ఆలయం వద్ద వార్డు అభివృద్ధిపై సెల్ఫీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖను అభివృద్ధి చేసింది టిడిపియేనన్నారు. విశాఖలో ఇనార్బిట్ మాల్ రావడానికి జగన్‌రెడ్డి కారణం కాదన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, వార్డు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లూరి సత్యనారాయణ రెడ్డి, లక్ష్మి శివప్రసాద్ పాల్గొన్నారు.

విశాఖను నాశనం చేసి శంకుస్థాపనలా...?

ప్రజాశక్తి -కలెక్టరేట్: విశాఖను నాలుగేళ్లపాటు అన్ని విధాలా నాశనం చేసి, ఇపుడు శంకుస్థాపనలతో ప్రజలను సిఎం జగన్‌రెడ్డి మోసగిస్తున్నారని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం టిడిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2 వేల కోట్లు విలువ చేసే లూలూ మాల్‌ను తరిమేసి రూ.500 కోట్లుతో వచ్చే ఇనార్బిట్ మాల్‌కు శంకుస్థాపన చేసి ఏదో ఉద్ధరించామని మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

ఓటర్ల జాబితా సవరణపై సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ -2024 కార్యక్రమంపై కేంద్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్లతో రెండు రోజుల సమీక్షా సమావేశం బుధవారం ఉదయం బీచ్ రోడ్‌లోని నోవాటెల్ హోటల్‌లో ప్రారంభమైంది. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సవరణపై సమీక్ష నిర్వహించారు. కొత్తగా చేరిన వారి నమోదుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సమావేశంలో కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్లు ధర్మేంద్ర శర్మ, నితీష్ వ్యాస్, డిప్యూటీ ఎన్నికల కమిషనర్ హృదేష్ కుమార్, సీనియర్ ప్రిన్సిపల్ సెక్రటరీ నరేంద్ర ఎన్.బుటాలియా, ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్ కుమార్ పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లు సీజ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలోని ఎంవిపి కాలనీ, ఉషోదయ ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ చేసిన గ్యాస్ సిలిండర్లపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్‌పి స్వరూపరాణి ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించారు.. ఉషోదయ సెక్టార్ 12లో ఆర్‌బికె మిల్క్ ఫుడ్స్, మీల్స్ కర్రీ పాయింట్ షాప్‌లో అక్రమంగా నిల్వ చేసిన సిలిండర్లను పట్టుకున్నారు. అనధికారికంగా ఉన్న ఎనిమిది సిలిండర్లను సీజ్ చేశారు

ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ సమావేశాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అణ్వాస్త్ర రహిత ప్రపంచం కోసం అవగాహన కలిగించే చర్యల్లో భాగంగా ఈ నెల 5 నుంచి 9 వరకూ బివి ఫౌండేషన్, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థల ఆధ్వర్యంలో విద్యాలయాల్లో సమావేశాలు తలపెట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఉదయం ఎంవిపి.కాలనీలోని ఎస్‌వివిపివిఎంసి డిగ్రీ కళాశాలలో ఆవిష్కరించారు. నరవ ప్రకాశరావు, డాక్టర్ కె.జగదీష్ పాల్గొన్నారు.

సమస్యలపై విద్యుత్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా ఉన్న విశాఖపట్నం విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్ట్రగుల్ కమిటీ కన్వీనర్ ఆర్.సత్యారావు, ఛైర్మన్ వేపాడ సత్యనారాయణ మాట్లాడుతూ ఎపి విద్యుత్ సంస్థలో ఉద్యోగుల, కాంట్రాక్ట్ కార్మికుల, ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులకు ఇపిఎఫ్ నుంచి జిపిఎఫ్ మార్పు, పీస్ రేట్ కార్మికులకు ఉద్యోగ భద్రత తదితర డిమాండ్ల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వేతన సవరణ విషయంలో తాత్సారం తగదంటూ ఏడు ట్రేడ్ యూనియన్లు గత నెల 26న విజయవాడలో వేలాది మందితో రాష్ట్ర సదస్సు విజయవంతంగా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యుత్ ఉద్యోగులకు 45 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి ఇవ్వాలన్నారు. విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. కారుణ్య నియామకాలలో అడ్డగోలు నిబంధనలు పెట్టకుండా ముందుకు సాగాలన్నారు. సమస్యలు పరిష్కారంకానిపక్షంలో ఈ నెల 10 తరువాత ఎప్పుడైనా సమ్మెకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పివిడి.ప్రసాద్, ప్రేమ చంద్రశేఖర్, శ్రీనివాసరావు, ఎస్‌డి.అప్పారావు, క్రాంతి కుమార్ పాల్గొన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు జి.అప్పలరాజు, వై.రాజు, చంద్రమౌళి, ఎఐటియుసి నాయకులు ఎస్‌కె.రెహమాన్, ఎం.మన్మధరావు మద్దతు తెలిపారు.



ధర్నా నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

రిలే దీక్షలు ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షలు ప్రారంభమయ్యాయి. జెఎసి జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, కన్వీనర్ కెటి.భాస్కరరావు, ఛైర్మన్ ఎస్.చిరంజీవులు, డిస్కమ్ యూనిట్ రాష్ట్ర అధ్యక్షులు మహేశ్వరరెడ్డి మాట్లాడారు. పరిమితిలేని పూర్తి వైద్య సౌకర్యం అమలు చేయాలన్నారు. అన్ని ప్రాథమిక క్యాడర్లలో రిక్రూట్‌మెంట్ చేపట్టాలని కోరారు. ప్రస్తుత ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలన్నారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు అనకాపల్లి నూకరాజు, రవిశంకర్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించరూ..

ప్రజాశక్తి- కలెక్టరేట్: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సెవెన్‌హిల్స్ హాస్పిటల్స్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి నూకరాజు డిమాండ్ చేశారు. బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జిల్లా నర్సింగ్ హోం, హాస్పిటల్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వై.రాజు అధ్యక్షతన సెవెన్‌హిల్స్ హాస్పిటల్ కార్మికులు నిరసన చేపట్టారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యలపై ప్రశ్నిస్తే కార్మికులను తొలగించడం దుర్మార్గమన్నారు. యూనియన్ అధ్యక్షులు నాయుడు మాట్లాడుతూ ఆసుపత్రిలో సూపర్‌వైజర్ల అరాచకాలు ఎక్కువయ్యాయని, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవరిస్తునా్నరన్నారు..మహిళా కార్మికురాలు రాజీ మాట్లాడుతూ కార్మికుల కష్టానికి తగ్గ వేతనం లభించడం లేదని, అడిగితే పనిఒత్తిడి పెంచి కక్ష సాధింపులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొర వేతనాలతో జీవనం దుర్భరమౌతోందని, వేతనాలను పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. సిఐటియు నాయకులు చంద్రమౌళి పాల్గొన్నారు.



ఆందోళన చేపట్టిన హాస్పిటల్ కార్మికులు

వైసిపి జిల్లా అధ్యక్షునిగా గురువులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షునిగా కోలా గురువులు బుధవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్, తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడారు. జగన్ మోహన్ రెడ్డి కష్టాల్లో ఉన్నప్పుడు ఆయనకు అండగా నిలిచిన వారిని గుర్తుంచుకొని వారికి తగిన న్యాయం చేస్తూ వస్తున్నారని అన్నారు. సిఎం దసరాకు అందరికీ బ్రహ్మాండమైన కానుకను అందజేస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

అమృత్ భారత్‌తో రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా వాల్తేరు రైల్వే డివిజన్‌లోని విజయనగరం జంక్షన్, శ్రీకాకుళం రోడ్, దువ్వాడ, బొబ్బిలి జంక్షన్, జగదల్‌పూర్, సింహాచలం, పార్వతీపురం, చీపురుపల్లి, జైపూర్, నౌపడ జోన్, దమన్‌జోడి, అరకు, కోరాపుట్, కొత్తవలస, పర్లాకిమిడి వంటి 15 స్టేషన్లను త్వరలో ఆధునికీకరించనున్నారు. ఈ మేరకు మొదటి దశ పనుల్లో భాగంగా దువ్వాడకు రూ.18 కోట్లు, విజయనగరానికి రూ.26 కోట్లు వెచ్చించనున్నారు. ఈ క్రమంలో మాస్టర్ ప్లాన్‌లు కూడా సిద్ధమయ్యాయి.

రేపు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఎఇ సురేష్‌కుమార్ తెలిపారు. పెద్దిపాలెం, పల్లిపేట, మచ్చవానిపాలెం, బిపి.కల్లాలు, పొడుగుపాలెం, చందక, గొట్టిపల్లి, వెంకటాపురం, జగన్నాధాపురం తదితర ప్రాంతాలకు ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండదని, గృహ, వాణిజ్య, వ్యవసాయ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నిరుపేదకు నిత్యావసరాలు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు పరిధి కొత్తపేటకు చెందిన నిరుపేద వై.సన్యాసిరావుకు గాయత్రి జెరాక్స్ అధినేత బి.లీలావతి బుధవారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాస్తవ సేవా సంఘం అధ్యక్షులు పిట్టా సురేష్, సభ్యులు ప్రకాష్, దుర్గారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న బెహరా భాస్కరరావు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- గోపాలపట్నం : జివిఎంసి 91, 92 వార్డులలోని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు జివిఎంసి కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆనంద్‌కుమార్ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 92వ వార్డు అధ్యక్షులు జి.అప్పలస్వామినాయుడు, గొంతిన నాగరాజు, కంపర సత్తిబాబు, నీలాపు శ్రీనివాస్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

తాటితూరులో 'ఫ్యామిలీ డాక్టర్'

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, తాటితూరులో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వైద్యులు, సిబ్బంది వెళ్లి వివిధ ఆరోగ్య పరీక్షలు చేశారు. ఆంధ్రా వైద్య కళాశాల సామాజిక వైద్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిరిగిడి సంతోషి, వైసిపి నాయకులు ఈశ్వరరావు, తాళ్లవలస పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎబి.మల్లికార్జునరావు, వైద్యులు రాధాకుమారి, కృష్ణవేణి పాల్గొన్నారు.

సినీ గాయకుడు ధనుంజయ్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం సంగీత విభాగం పరిశోధక విద్యార్థి, సినీ గాయకుడు పి.ధనుంజయ్‌కు పిహెచ్‌డి డాక్టరేట్ లభించింది. సంగీత విభాగం ఆచార్యులు కె.సరస్వతీ విద్యార్థి పర్యవేక్షణలో 1960-2020 సంవత్సరాల మధ్యకాలంలో తెలుగు సినీ సంగీతంలో వీణ, వయొలిన్, వేణువుల వినియోగం అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. బుధవారం ఎయు వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను ధనుంజయ్ స్వీకరించారు. ఈ సందర్భంగా ధనుంజయ్‌ను పలువురు ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై దిగ్బంధం



సింటర్‌ప్లాంట్‌ను దిగ్బంధం చేసిన కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన సింటర్‌ప్లాంట్ హెచ్‌ఒడి కార్యాలయాన్ని కార్మికులు బుధవారం దిగ్బంధించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, స్కిల్డ్ కార్మికులకు బోనస్, ఇఎస్ఐ, నోటీసు పేలో కోత వేశారని తెలిపారు. ఎస్ఎంఎ, ఎఎస్ఎంఎ, ఐఆర్‌ను కార్మికులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. స్కిల్డ్ కార్మికులకు నోటీసు పే, బోనస్, ఇఎస్ఐ వర్తించేలా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికుల నాయకులు మంత్రి రవి (ఎఐటియుసి), జి.శ్రీనివాస్ (సిఐటియు), సత్యారావు, పల్లా మంగరాజు (ఐఎన్‌టియుసి), నాయకులు సత్యవతి, ఈశ్వరావు, నాగరాజు, గురుప్రసాద్, నమ్మి రమణ, కెపి.సుబ్రహ్మణ్యం, పి.మసేను, యు.సోమేష్, చట్టి నర్సింగరావు, కె.సత్యవతి పాల్గొన్నారు.

గీతం లా స్కూల్ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ద్వారా 2023-24 విద్యా సంవత్సరంలో న్యాయ విద్యను అభ్యసించడానికి ప్రవేశాలు పొందిన నూతన విద్యార్థులకు బ్రిడ్జి కోర్సును బుధవారం న్యాయ నిపుణుల సమక్షంలో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ న్యాయ నిపుణుడు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ఎ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, న్యాయ విద్యను అభ్యసించిన ప్రతి ఒక్కరూ వృత్తి నైపుణ్యాలను పెంచుకోవడానికి అధ్యాపకులతో ముఖాముఖి చర్చలతో పాటు వివిధ జర్నల్స్‌ను పరిశీలించి స్వయంగా నోట్స్ తయారు చేసుకోవడం అవసరమన్నారు. న్యాయ అంశాలను లోతుగా పరిశీలించి విశ్లేషణాత్మక దృష్టితో అవగాహన చేసుకోవాలన్నారు. విశాఖపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వి.రవీంద్రప్రసాద్ మాట్లాడుతూ, కాలానుగుణంగా మారుతున్న చట్టాలపై, వివిధ కోర్టులు ఇచ్చే తీర్పులపై అవగాహన పెంచుకోవాలన్నారు. న్యాయ విద్యను అభ్యసించే వారు కోర్టు హాలులో సీనియర్ న్యాయవాదులు పర్యవేక్షణలో వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం మాట్లాడుతూ, న్యాయ విద్యను అభ్యసించే వారు ఇతర రంగాల పైన అవగాహన కలిగి ఉండాలన్నారు. గీతం ప్రొవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు మాట్లాడుతూ, నూతన విద్యావిధానంలో వచ్చిన మార్పులకనుగుణంగా గీతంలో న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులకు సైన్స్, మేనేజ్‌మెంట్, సామాజిక శాస్త్రాలలో నచ్చిన సబ్జెక్టును మైనర్ సబ్జెక్టుగా ఎంచుకునే వీలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ లా డైరెక్టర్ ప్రొఫెసర్ అనితారావు, నూతన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'గీతం'ను సందర్శించిన మలేషియా వర్సిటీ బృందం



మలేషియా వర్సిటీ బృందాన్ని సన్మానిస్తున్న శ్రీభరత్ తదితరులు

ప్రజాశక్తి-మధురవాడ : మలేషియాకు చెందిన మోనాష్ విశ్వవిద్యాలయం ప్రతినిధి బృందం బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. మోనాష్ విశ్వవిద్యాలయం సీనియర్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ మాధ్యూ నికోల్సన్, ఇంపాక్ట్ స్కూల్ అధిపతి డాక్టర్ వివి.మోహన్‌లతో కూడిన బృందం గీతంలోని వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్, మూర్తి రీసెర్చ్ ల్యాబ్స్ తదితర విభాగాలను సందర్శించింది. అనంతరం గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవటం, ప్రొవైస్ ఛాన్సలర్లు ప్రొఫెసర్ వై.గౌతమరావు, డాక్టర్ బి.గీతాంజలి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, వివిధ విభాగాల డీన్లతో సమావేశం అయ్యారు. గీతం విశ్వవిద్యాలయంతో బోధన, పరిశోధనలో భాగస్వామ్య ఒప్పందాలను కుదుర్చుకునేందుకు తాము ఆసక్తితో ఉన్నామని మోనాష్ విశ్వవిద్యాలయం సీనియర్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ మాధ్యూ నికోల్సన్ తెలిపారు. ఈ సందర్భంగా గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ ప్రపంచ శ్రేణి విశ్వవిద్యాలయంగా మారడానికి ప్రణాళికాయుతంగా కృషి చేస్తున్నామని, ప్రముఖ విశ్వవిద్యాలయాలతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.పి. కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పూసేజెల్ వినియోగంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి -తగరపువలస : వేరుశనగ పంటలో పూసేజెల్ పదార్థం వాడే విధానంపై బుధవారం మండలంలోని లక్ష్మీపురంలో రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా శిక్షణా కేంద్రం, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు చదువుల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, పూసేజెల్ వినియోగించడం వల్ల వర్షం పడినప్పుడు నీటిని గ్రహిస్తుందని, వేరుశనగ పంట నీటి ఎద్దడికి గురికాకుండా రక్షిస్తుందని వివరించారు. పంటలో దిగుబడులు పెంచుకోవడానికి సూపర్ ఫాస్ఫేట్ 100 కిలోలు, జిప్సం ఎకరానికి 200 కిలోలు వెయ్యాలని రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్ మాట్లాడుతూ, గొప్ప తీసేటప్పుడు, కలుపు మందుల వాడితే ఎంతో ఉపయోగమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, జిల్లా శిక్షణ కేంద్రం ప్రతినిధి సిహెచ్.సురేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి బి.శివకోమలి, ఎఎంసి చైర్మన్ కెవి.రమణ, విఎఎలు బి.రమేష్, ఎల్.హరీష్ తదితరులు పాల్గొన్నారు.



బీమా పరిహారాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ కెల్ల సునీత

వైఎస్ఆర్ బీమా పరిహారం అందజేత

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు సచివాలయం నెంబరు 8 పరిధిలోని జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీకి చెందిన రాగోలు వెంకటరమణ సోమవారం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన భార్యకు వైఎస్ఆర్ బీమా తక్షణ సహాయం కింద రూ.10 వేలను బుధవారం వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత అందజేశారు. మిగిలిన మొత్తాన్ని నామినీ ఖాతాలో జయచేయనున్నట్టు సచివాలయ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి ఇన్‌ఛార్జి కెల్ల సత్యనారాయణ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ రామకృష్ణ, సచివాలయ కన్వీనర్ పిల్లి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

చిప్పాడలో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం చిప్పాడలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చిప్పాడ, ఆశిపాలెం, సిటీనగర్, కొనసనవానిపాలెం, నమ్మివానిపాలెం, కంచేరుపాలెం గ్రామాల్లో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి సమస్యలనడిగి తెలుసుకున్నారు. సిటీనగర్‌లో తాగునీటి పైపు లైన్ మరమ్మతులు చేపట్టాలని, 1, 2, 4 వార్డుల్లో డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటుచేయాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.వాసురాజు, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు, సర్పంచ్ వెంపాడ రమావతి, మాజీ సర్పంచ్ సరగడ రఘునాథరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు గాడు శ్రీను, వాలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

మహాశక్తి ప్రచార రథం ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మహాశక్తి ప్రచార రథాన్ని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు బుధవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, జివిఎంసి 2, 3 వార్డుల కార్పొరేటర్లు గాడు చిన్నికుమారిలక్ష్మి, గంటా అప్పలకొండ, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షులు బోయి రమాదేవి, తెలుగు మహిళలు వి.పోలమ్మ, మంగాదేవి, కనకరత్నం పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'జనంతో జనసేన'

ప్రజాశక్తి -ఆనందపురం : ప్రజా సమస్యల పరిష్కారానికే జనంతో జనసేన కార్యక్రమం నిర్వహిస్తున్నామని జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ చెప్పారు. మండలంలోని భీమన్నదొరపాలెంలో బుధవారం జనంతో జనసేన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేవరకు పోరాటం సాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శాఖరి శ్రీనుబాబు, కృష్ణయ్య, చంద్రరావు, మజ్జి శ్రీను, బొద్దాపు గోవింద, మూర్తి, పరిమి భువనేశ్వరి, ఎ.దివాకర్, బాలరాజు, పినిశెట్టి బంగార్రాజు, వీరన్న, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వాలు విఫలం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంగారావు

ప్రజాశక్తి-పెందుర్తి : మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వాలు విఫలం చెందుతున్నాయని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు విమర్శించారు. జివిఎంసి 92వ వార్డు పరిధి చైతన్యనగర్, 94వ వార్డు పరిధి అప్పలనరసయ్యకాలనీ, 97వ వార్డు వీరనగర్, 96వ వార్డు పరిధి ఉప్పరకాలనీలో బుధవారం ఆయన పర్యటించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చైతన్యనగర్‌లో రోడ్డు, డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి, అప్పలనరసయ్య కాలనీలో మెట్లు మార్గం ఏర్పాటుకు, వీరానగర్, ఉప్పర కాలనీలో కాలువలు, మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అధిక మొత్తంలో ఇంటి పన్నులు వసూలు చేస్తున్నా మౌలిక సదుపాయాలు కల్పించడంలేదని విమర్శించారు. సమస్యలు పరిష్కారం కాకుంటే జివిఎంసి ముందు కూర్చొని పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, జోన్ కార్యదర్శి రమణి, సిఐటియు నాయకుడు అప్పలనాయుడు పాల్గొన్నారు.



వార్డుల్లో పర్యటిస్తున్న గంగారావు, జగన్, రమణి తదితరులు

ఘనంగా 'రంగసాయి' వార్షికోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : 'రంగ సాయి నాటక సంఘం' 13వ వార్షికోత్సవాన్ని పౌర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి సారధ్యంలో ప్రముఖ నట దర్శకులు 'నవరస మూర్తి'కి సురభి బాబ్జి రంగస్థల సేవా పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వపరంగా ప్రతి నెలా నాటిక-నాటక పరిషత్తులను అన్ని జిల్లాల్లో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. నాటక రంగ అభివృద్ధికి బాదంగీర్ సాయి చేస్తున్న కృషిని అభినందించారు. విజయనిర్మాణ్ సంస్థ అధినేత సూరపనేని విజయకుమార్ మాట్లాడుతూ, బాదంగీర్ సాయి రంగస్థలం గురించే తపన పడుతుంటారని కొనియాడారు. ప్రముఖ నట, దర్శకులు చలసాని కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సురభి నాటక రంగానికి ప్రపంచ ఖ్యాతిని ఆపాదించిన ఘనత సురభి బాబ్జీకి దక్కుతుందన్నారు. కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన బొబ్బా ధవలేశ్వరరావు, కొణతాల రాజు, ఎమ్మెల్సీ రేవు రత్నకుమారి, సి.ఎ.తిలక్‌పట్నాయక్, సోమయాజుల జోగారావు, దండు నాగేశ్వరరావు, బొట్టా వేణు తదితరులు మాట్లాడుతూ, సన్మాన గ్రహీత నవరసమూర్తి, సన్మాన ప్రధాత బాదంగీర్ సాయిల రంగస్థల సేవలను కొనియాడారు. ప్రముఖ పాత్రికేయులు, నటులు ఎన్ఎన్ఆర్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మధురవాడ పోలక్స్ పాఠశాల ఆరవ తరగతి విద్యార్థి గంటి సాయి శివకార్తికేయ ప్రదర్శించిన కీచకుడు, సంజయుడు ఏకపాత్రాభినయాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శివజ్యోతి, హేమ, సంధ్యా ప్రియదర్శిని, గంటి సీతామహాలక్ష్మి, దేవి, సీతామూర్తి, సముద్రం వెంకటేష్, సుబ్రహ్మణ్యం, జమ్మా చినబాబు, సి.హెచ్. రాజు, కిరణ్, రవి పాల్గొన్నారు. చివరగా ఎస్.కాశీవిశ్వనాథ్ రచించిన నాటక పుస్తకాలను బాదంగీర్ సాయికి ఎస్.శ్రీధర్ అందజేశారు.

రెండు రోజులు నీటి సరఫరా బంద్

ప్రజాశక్తి- గాజువాక : వర్షాలు కారణంగా ఏలేరు ఎడమ కాలువ దెబ్బతినడంతో గాజువాక జోన్ పరిధిలో ఈ నెల 3, 4 తేదీల్లో నీరు సరఫరా చేయలేమని జివిఎంసి వాటర్ సరఫరా విభాగం ఎఇ కేదార్‌నాథ్ తెలిపారు. దీనికి ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గాజువాక ప్రజలు గమనించాలని కోరారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మహిళా నేతలు

పోరుయాత్ర బహిరంగసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-పెందుర్తి : హింసను అరికట్టాలంటూ ఈ నెల 8న విజయవాడలో నిర్వహించే మహిళా పోరు యాత్రను విజయవంతం చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా నాయకులు పద్మ పిలుపునిచ్చారు. హింసపై మహిళల పోరుయాత్ర మహాసభ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ, మణిపూర్ ఘటనలు చాలా బాధాకరమన్నారు. పెందుర్తిలో వృద్ధురాలిపై హత్య శోచనీయమన్నారు. మహిళల హక్కుల కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు వచ్చి పోరాటాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి రమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

త్వరలో ఉక్కునగరంలో ఓపెన్ జిమ్‌లు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరంలో ఏర్పాటుచేస్తున్న ఓపెన్ జిమ్‌లు త్వరలో ప్రారంభమవుతాయని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. తృష్ణా మైదానంలో ఏర్పాటుచేస్తున్న ఓపెన్ జిమ్‌ను కార్పొరేటర్ బి.గంగారావుతో కలిసి వైటి.దాస్, యు.వెంకటేశ్వర్లు, కెఆర్‌కె.రాజు, డి.కృష్ణమూర్తి, ఎస్.కృష్ణమూర్తి, యు.బొంజిబాబు, ఎంవి.రమణమూర్తి, భానుమూర్తి బుధవారం పరిశీలించారు. ఉక్కునగరం సెక్టార్ 3, 6, 8, 11లలోనూ, త్రిష్ణా గ్రౌండ్, ఉక్కు స్టేడియం, శనివాడ వాకర్స్ పార్క్, సిఐఎస్ఎఫ్ క్వార్టర్స్ పార్క్ తదితర 8 ప్రాంతాల్లో రూ.40 లక్షలతో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటుచేస్తున్నట్లు గంగారావు తెలిపారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ప్రిన్సిపల్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆర్ట్సుకళాశాల పరిధిలోని బిఇడి పరీక్ష కేంద్రాలను ఆర్ట్సు కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు బుధవారం పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడంపట్ల అధికారులను అభినందించారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై టిడిపి ధర్నా



పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -గాజువాక : శీలానగర్‌లో ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం వద్ద ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని, దీన్ని అడ్డుకోవాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యాన ఆసుపత్రి ఏర్పాటు స్థలం వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, లక్షలాదిమంది కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని 69వ వార్డు పరిధి శీలానగర్ వద్ద గత ప్రభుత్వం ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మాణానికి 10 ఎకరాలు స్థలం కేటాయించిందన్నారు. ఈ స్థలాన్ని పరిరక్షించి ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మాణాన్ని శరవేగంతో పూర్తి చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మాణ స్థలంలో కల్వర్టుల నిర్మాణానికి అనుమతి ఇచ్చిన గాజువాక జోనల్ కమిషనర్, ఆర్‌డిఒపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీన్ని ఆపకపోతే జివిఎంసి ప్రధాన కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. 69వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి అక్కిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రసాదుల శ్రీనివాస్, విజయబాబు, బొండా జగన్, గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, మహమ్మద్ రఫీ, విళ్లా రామ్మోహన్, కోగంటి లెనిన్‌బాబు, చెరుకూరు నాగేశ్వరరావు, తమ్మిన విజయకుమార్, అలమండ రాజు, జీవన్‌బాబు పాల్గొన్నారు.

30వ రోజుకు 'గంగవరం' దీక్షలు

ప్రజాశక్తి- గాజువాక : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అదాని గంగవరం పోర్టు కార్మికులు చేపట్టిన నిరవధిక దీక్షలు బుధవారం నాటికి 30వ రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఇంటికి కార్మికులు వెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ప్రభుత్వం వైపు నుంచి అదాని గంగవరం పోర్టు యాజమాన్యంతో మాట్లాడుతున్నప్పటికీ మొండిగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం 10 మంది కార్మికులను విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ వద్దకు, వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి దగ్గరకు ఎమ్మెల్యే నాగిరెడ్డి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సమక్షంలో విశాఖ ఎంపీకి కార్మికులు వినతిపత్రం అందించారు. ఈ సమస్యను పార్లమెంట్‌లో ప్రస్తావించాలని ఎంపీని కోరారు. అనంతరం సుబ్బారెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. వేతనాలపై పోర్టు యాజమాన్యం స్పష్టత ఇవ్వడంలేదని, మరో మారు మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు, కోశాధికారి వాసుపల్లి ఎల్లాజీ, నాయకులు గంటిపిల్లి అమ్మోరు, మాద అప్పారావు, గంటిపిల్లి లక్ష్మయ్యచ నొల్లి స్వామి, కదిరి సత్యానందం, పేర్ల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన గంగవరం పోర్టు కార్మికులు

నూతన విద్యా విధానంపై అవగాహన



మాట్లాడుతున్న మాజీ వైస్ ఛాన్సలర్ వై.నరసింహులు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలోని ఎంవిఆర్ డిగ్రీ కళాశాలలో నూతన విద్యా విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.నరసింహులు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నూతన జాతీయ విద్యా విధానం ఉపయోగాలను వివరించారు. సంప్రదాయ విద్యావిధానానికి బదులుగా సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించడమే దీని ఉద్దేశం అన్నారు. విద్యార్థి ఆలోచనలో మార్పు వచ్చేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలన్నారు. 2030 సంవత్సరానికి అన్ని కాలేజీలు స్వయం ప్రతిపత్తి పొందేందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు శిక్షణ పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ బి.రామారావు, ప్రిన్సిపల్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ కృష్ణ పాల్గొన్నారు.

27వ వార్డులో 'టిడిపి సెల్ఫీ'

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 27వ వార్డు ఎరుకుమాంబ ఆలయం ప్రాంతం నుంచి టిడిపి సెల్ఫీ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. దొండపర్తిలోని మండావారి వీధిలో పాఠశాల పరిస్థితి చూపుతూ మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి సెల్ఫీ తీసుకున్నారు. ఆ పరిసర ప్రాంతాలలో ఉన్న సమస్యలను స్థానికులనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం నెహ్రూ బజార్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా గండి బాబ్జి మాట్లాడుతూ, దక్షిణ నియోజకవర్గంలో ప్రతి ప్రాంతాన్నీ సందర్శించి సమస్యలపై అవగాహన చేసుకున్నానని తెలిపారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు. నవరత్నాలు అని నవమోసాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. దక్షిణ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సొంత ప్రయోజనాలు చూసుకుంటున్నారు తప్ప ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, పార్టీ వార్డు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లూరి సత్యనారాయణరెడ్డి, లక్ష్మీ శివప్రసాద్, నాయకులు పివి.రమణారావు, గురునాధరావు, బాబీ, బిఎ.రెడ్డి, కనకారావు, గంగరాజు, గుర్రాచరి, శంకరరెడ్డి, మజ్జి వెంకన్న, నాగేంద్ర రెడ్డి, రాంబాబు రెడ్డి, బొట్టా శంకర్, రామచంద్రరెడ్డి, జగన్, నాగభూషణం, శేషు, సుజాత, సుగుణ, అచ్చియ్యమ్మ గనగళ్ళ సత్య, వి.గాయత్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్లాన్ ప్రకారం నిర్మించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి నుంచి తీసుకున్న ప్లాన్ అనుమతులకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని టౌన్ ప్లానింగ్ అధికారులు సూచించారు. సీతంపేట సాయిబాబా గుడి వద్ద సర్వేనెంబర్ 13లో జరుగుతున్న నిర్మాణ పనులను జివిఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం పరిశీలించారు. గెడ్డకు బఫర్ జోన్ వదలాలని, షార్ట్‌ఫాల్ క్లియరెన్స్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిసిపి, ఎసిపి, టిపిఎస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 72వ వార్డు పరిధి చినగంట్యాడలో రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) సెంటర్‌ను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పనికిరాని వస్తువులతో కళాత్మకంగా వస్తువులను రూపొందించేందుకు ఈ సెంటర్లు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కాలుష్య నియంత్రణ, ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యంగా జివిఎంసి పలు చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఎడిసి వి.సన్యాసిరావు, గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, ఎంహెచ్ఒ కిరణ్‌కుమార్, ఎస్ఇ గోవిందరావు, 72వ వార్డు కార్పొరేటర్ ఎజె.స్టాలిన్, వైసిపి నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, సిరట్ల వాసు పాల్గొన్నారు.

ఏకరూప పౌరస్మృతితో భారత సమైక్యత, సంస్కృతిపై దాడి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన ఏకరూప పౌరస్మృతి వల్ల భారత సమైక్యత, సంస్కృతి దెబ్బతింటాయని ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. యూనిఫామ్ సివిల్ కోడ్‌పై ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కార్మిక కర్షక భవనంలో సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శర్మ మాట్లాడుతూ యూనిఫామ్ సివిల్ కోడ్‌ను అందరూ వ్యతిరేకించాలన్నారు. భారతదేశం భిన్నజాతులు, మతాలు, కులాల సమూహారమని, అటువంటి లౌకిక భారతదేశంలో బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీయడానికి యూనిఫాం సివిల్ కోడ్ తీసుకొచ్చిందని తెలిపారు. 21వ లా కమిషన్ చేసిన సిఫారసులను మోడీ ప్రభుత్వం అమలు చేయలేదని, ఇప్పుడు 22వ లా కమిషన్ను వేసిందని, ఇది రాజకీయ ఉద్దేశంతో 2024లో ఎన్నికల్లో లబ్ధి పొందడానికి తీసుకొచ్చిందని పేర్కొన్నారు. భారతదేశంలో వివిధ జాతులు కులాలు, మతాలలో వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత అనే అంశాలు వేరువేరుగా ఉన్నాయని, భిన్నత్వంలో ఏకత్వం గల ఈ దేశంలో మతతత్వాన్ని రెచ్చగొట్టే చర్యలకు బిజెపి పూనుకుంటుందని విమర్శించారు. యూనిఫాం సివిల్ కోడ్ వల్ల అన్ని మతాలలో మహిళలకు చట్టం సమానంగా ఉంటుందని చెప్పడం అబద్ధమని, మహిళలకు ఇవ్వాల్సిన హక్కులే వారికి ప్రభుత్వ ఇవ్వడం లేదని తెలిపారు. యూనిఫాం సివిల్ కోడ్ పై ప్రజలందరూ సంపూర్ణంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. దీనిపై బీజేపీ కుతంత్రాలను అర్థం చేసుకొని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకి ఉపాధ్యాయ ఉద్యోగ కార్మిక, పెన్షనర్ల ఐక్యవేదిక నాయకులు బి.ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.చినబ్బాయి, గంటా శ్రీరామ్ వివిధ ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ హేమంత్

ఆరోగ్య ఉపకేంద్రంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఆర్వి.అగ్రహారం ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.హేమంత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉప కేంద్రంలో జరుగుతున్న 14 రకాల వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం జిల్లాలో చక్కగా జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న ఆసుపత్రుల్లో మందుల కొరత లేదన్నారు. ఈ కార్యక్రమంలో లంకవానిపాలెం పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ శైలజ సురేష్ కుమార్, హెల్త్ సూపర్వైజర్ జవ్వాది సన్యాసిరావు, హెచ్‌వి భాగ్యలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి-కె.కోటపాడు

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ ఎన్విరాన్మెంట్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ సంతోష్ తెలిపారు. మండలంలో చౌడువాడ గ్రామ సచివాలయంలో సచివాలయం సిబ్బంది, మహిళ సంరక్షణ కార్యదర్శి లక్ష్మి, సెక్రెటరీ నక్కా రాము నాయుడుతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ సాంఘిక దురాచారమైన బాల్యవివాహాలను అరికట్టాలని, గ్రామాల్లో ప్రతి ఒక్కరు చదువుకోవాలని కోరారు. చదువుకునేందుకు ఆర్థిక స్తోమత లేని పిల్లలు మధ్యలో చదువు మానేసి బాల కార్మికులుగా మారిన పిల్లలు ఎవరైనా ఉంటే తమ సంస్థ చదువు కొనసాగించేందుకు సహాయం చేస్తుందని తెలిపారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పర్యటించి గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, జనసేన నాయకులు కుంచా అంజిబాబు పాల్గొన్నారు.

ఎంవిఆర్‌ను కలిసిన శేషారెడ్డి

ప్రజాశక్తి- అనకాపల్లి

అతిత్వరలో రాజకీయ రంగ ప్రవేశం చేయబోతున్న సేవాపరుడు ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్)ను బుధవారం ఆదిత్య ఇంజనీర్ కళాశాల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణంలోని నరసింగరావు పేటలోని ఎంవిఆర్ స్వగృహానికి శేషారెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా శేషారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో ఉమ్మడి జిల్లాలో మంచి పేరు, అభిమానులను సంపాదించుకున్న ఏకైక వ్యక్తి ఎంవిఆర్ ఒక్కరే అని తెలిపారు. తనకు ఉన్న దయాహృదయం, ఆయనను అతి తక్కువ సమయంలో ఇంతటి పేరు ప్రతిష్టలు తెచ్చేవిధంగా చేశాయన్నారు. ప్రజలకు ఉపకారం చేసే వారే రాజకీయాలలో నిలబడతారని, ఆ కోవకు చెందిన వారే ఎంవిఆర్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పంచాయతీ కార్మికుల సమస్యలపై ధర్నా



మాట్లాడుతున్న సిఐటియు నేత సోమునాయుడు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం తలపెట్టినట్లు సిఐటియు అనుబంధ సంఘాల సమన్వయ కమిటీ మండల కన్వీనర్ కూండ్రపు సోమ నాయుడు తెలిపారు. అచ్యుతాపురంలో బుధవారం పంచాయతీ కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో పారిశుద్ధ్య కార్మికులతో అనేక సేవలో చేయించుకున్న ప్రభుత్వం వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలం చెందిందని తెలిపారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బకాయి పడిన జీతాలు చెల్లించాలని, యూనిఫామ్, సబ్బులు, కొబ్బరినూనె వెంటనే సరఫరా చేయాలని, ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని, వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెవిటి అర్జున్, దోసూరు నాగమణి, తట్టా నూకరాజు, రెట్టపల్లి సూరిబాబు, పొన్నాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకే తొలి ప్రాధాన్యత

- జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎన్నికల కమిషన్ ఆదేశాలననుసరించి బూత్ స్థాయి అధికారులు ఎన్నికల విధులకే మొదటి ప్రాధాన్యతను ఇస్తారని డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి, డిఆర్ఓ పి.వెంకటరమణ స్పష్టం చేశారు. ఈ విషయంలో వారికి ఆదేశాలు ఇచ్చామన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఓటర్ల నమోదు కార్యక్రమం ప్రణాళికాయుతంగా, ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బిఎల్‌వోలు డోర్ నెంబర్ ప్రకారం ఓటర్ల జాబితాను తనిఖీ చేసి మార్పులు చేర్పులు తప్పొప్పులను సవరిస్తారని చెప్పారు. 0 డోర్ నెంబరు, పదిమంది కన్నా ఎక్కువ ఓటర్లు ఒకే ఇంట్లో ఉన్నట్లయితే, 100 సంవత్సరాలు దాటిన ఓటర్లు వీటిపై క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. బిఎల్ఓ వెంట వార్డు వాలంటీర్ వెళ్లకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ఏ ప్రాంతంలోనైనా తప్పులు నమోదయినట్లు తెలిస్తే రాజకీయ పార్టీల వారు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అన్ని డోర్ నెంబర్ల ఇళ్లను తప్పక తనిఖీ చేస్తారని ఒక ప్రశ్నకు బదులిచ్చారు. 80శాతం ఓట్లు ఆధార్‌తో అనుసంధానం అయ్యాయని చెప్పారు. ఈ సమావేశంలో ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సిహెచ్. నాగేశ్వరరావు (బిజెపి), కే.హరినాథ బాబు (ఆమ్ ఆద్మీ) వైఎస్.భద్రం (సిపిఐ) ఎస్.వి.వి. రామచంద్రరావు (బి.ఎస్.పి) పాల్గొన్నారు.

అనకాపల్లి అభివృద్ధి పట్టని అమర్‌నాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శాసనసభ్యుడు, జిల్లా మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు అవినీతి, అక్రమాలు, డబ్బు మీద ఉన్న యావ, పేదల సంక్షేమం పట్ల లేదని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగ జగదీశ్వరరావు విరుచుకుపడ్డారు. సత్యనారాయణపురం టిడ్కో గృహాలను బుధవారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పట్టణ పరిధిలో నిరుపేదలు 5,600 కుటుంబాలున్నట్లు ప్రభుత్వ లెక్కలు తేల్చగా వారిలో 3,415 మందికి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహాలను సత్యనారాయణపురం, కొండ కొప్పాక, శిరసపల్లి, రాజుపాలెం గ్రామాల్లో నిర్మించగా, 2018 డిసెంబరులో లబ్ధిదారులు గృహప్రవేశాలు చేశారని గుర్తు చేశారు. వారికి ఆర్ఈసీఎస్ నుండి విద్యుత్ మీటర్లు కూడా వచ్చాయన్నారు. అనకాపల్లి ప్రజలు అమర్నాథ్‌పై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపిస్తే, అనకాపల్లి పట్టణ పేద ప్రజలను కాదని 1270 గృహాలను విశాఖ దక్షిణ నియోజకవర్గానికి కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అమర్నాథ్ అనకాపల్లికి శాసనసభ్యుడా? దక్షిణ నియోజకవర్గానికి శాసనసభ్యుడా? అని నాగ జగదీష్ ప్రశ్నించారు. కార్యక్రమంలో డాక్టర్ నారాయణరావు, బోడి వెంకటరావు, బొడ్డేడ మురళి, మళ్ల గణేష్, సాలాపు నాయుడు, కోన శ్రీనివాసరావు, విల్లూరి రమణబాబు, అండిబోయిన శేషు, మళ్ల శివన్నారాయణ, శ్రీనివాసరావు, బుద్ద భువనేశ్వర్, పొలిమేర నాయుడు, సూరిశెట్టి బాలమ్మ, వేగి వెంకటరావు, మద్దాల నారాయణరావు పాల్గొన్నారు.



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న నాగజగదీష్ తదితరులు

డైవర్షన్ రోడ్లు బురదమయం

ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

కశింకోట- బంగారు మెట్ట రోడ్డు విస్తరణ నిమిత్తం మండలంలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్లు ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలకు బురదమయంగా మారాయి. రోడ్డు విస్తరణలో భాగంగా రాజాం -బుచ్చయ్యపేట గ్రామాల మధ్య, రాజాం-కందిపూడి గ్రామాల మధ్య కల్వర్టుల నిర్మాణాలను కొద్దిరోజులుగా చేపడుతున్నారు. కల్వర్టులు నిర్మాణం చేసే ప్రాంతాల్లో వాహనదారుల రాకపోకలకు అనుగుణంగా పక్కనుండి డైవర్షన్ రోడ్లను ఏర్పాటు చేశారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్ కేవలం మట్టిని సరి చేసి ఈ డైవర్షన్ రోడ్లు ఏర్పాటు చేశారు. కొద్దిరోజులుగా అడపాదడపా చిరుజల్లులు కురుస్తుండడంతో డైవర్షన్ రోడ్లు బురదమయంగా మారాయి. ఈ రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు గుండా నిత్యం వేలాదిమంది ప్రయాణికులు, వందలాది వాహనాల్లో రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. మండలంలోని వడ్డాది, దిబ్బిడి, బుచ్చయ్యపేట, కెపి.అగ్రహారం, కొండపాలెం తదితర గ్రామాలకు చెందిన వారు జిల్లా కేంద్రమైన అనకాపల్లికి రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఈ డైవర్షన్ రోడ్లో భారీ వాహనాలు రాకపోకలు సాగించే క్రమంలో బురదలో కూరుకుపోతున్నాయి. దీంతో వాహనదారుల అవస్థలు వర్ణించలేనివి. డైవర్షన్ రోడ్లో నీరు నిల్వ లేకుండా ఏర్పాటు చేయడంతో పాటు క్రషర్ డస్ట్ వేస్తే వాహనదారులకు ఇబ్బందులు ఉండవని వాహనదారులు కోరుతున్నారు.



బురదతో ఉన్న డైవర్షన్ రోడ్డు

జివిఎంసి స్థలంలో నిర్మాణ అనుమతులు రద్దు చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి గాంధీనగరం, మిరియాల కాలనీ టౌన్ సర్వేనెంబర్ 348లో జరుగుతున్న మున్సిపాలిటీ స్థలం కబ్జాపై లోకయుక్త విచారణకు స్వీకరించిన నేపథ్యంలో సదరు స్థలంలో నిర్మించే భవనానికి ఇచ్చిన అనుమతులన్నీ రద్దు చేయాలని సిపిఐఎంఎల్ నాయకులు పీఎస్ అజయ్ కుమార్, సిపిఎం నాయకులు ఎ.బాలకృష్ణ, సిపిఐ నాయకులు రాజాన దొరబాబు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సదరు స్థల కబ్జా విషయమై జివిఎంసి కమిషనర్‌కు, అనకాపల్లి జోనల్ కమిషనర్‌కు ఈ ఏడాది జూన్ 19న ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. దీంతో అవినీతి నిరోధక శాఖ, సిబిసిఐడికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 60 చదరపు గజాల ఇంటికి డిక్రీ తీసుకొచ్చి 534 చదరపు గజాల మున్సిపాలిటీ స్థలాన్ని సొంత జరాయితీ స్థలంగా అమ్మివేశారని, వారిపై ల్యాండ్ గ్రాబర్స్ చట్టం కింద కేసులు నమోదు చేయాల్సి ఉందగా, అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. అనుమతులు పొందిన వారు సదరు స్థలాన్ని ఆనుకొని ఉన్న మిగిలిన స్థలాన్ని కాజేయడానికి విలుగా ముందు భాగాన్ని పూర్తిగా ఆక్రమించి నిర్మాణాన్ని చేపడుతున్నా అనకాపల్లి జోనల్ అధికారులు చోద్యం చూస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై నిర్దిష్టమైన సాక్ష్యాలతో వామపక్ష పార్టీలు లిఖితపూర్వకమైన ఫిర్యాదు సమర్పించినా నేటి వరకూ ఎలాంటి విచారణ చేపట్టడం లేదని విమర్శించారు. కోట్లాది రూపాయల విలువైన మున్సిపల్ స్థలాన్ని స్వాధీనం చేసుకొని ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా పౌర గ్రంథాలయాన్ని నిర్మించాలని కోరినా అధికారులు రాజకీయ ఆర్థిక ఒత్తిళ్లకు లొంగి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. భూ కబ్జాదారులు ఇచ్చే లంచాలకు కక్కుర్తి పడి వారికి సహకరిస్తే న్యాయస్థానం ముందు దోషులుగా నిలబడవలసి ఉంటుందని హెచ్చరించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న దొండా సన్యాసిరావు

వడ్డాది పిఎసిఎస్ వార్షిక టర్నోవర్ రూ.9.5 కోట్లు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం, వడ్డాది పీఏసీఎస్ వార్షిక టర్నోవర్ రూ.9.5 కోట్లకు పెంచామని పిఎసిఎస్ చైర్మన్ దొండా సన్యాసిరావు తెలిపారు. వడ్డాది పిఎసిఎస్ అధ్యక్షుడిగా దొండా సన్యాసిరావు, సభ్యులుగా కోవెల ఈశ్వరరావు, పొలిమేర కాశీ పదవీ కాలం ఆరో ఆరు నెలలు పొడిగించడంతో బుధవారం వారు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సన్యాసిరావు విలేకరులతో మాట్లాడుతూ తమ పదవీ కాలాన్ని మరోసారి పొడిగించినందుకు ఎమ్మెల్యే ధర్మశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు. 2013 జనవరి నుండి పిఎసిఎస్ అధ్యక్షుడిగా తాను కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వ్యవసాయేతర రుణాలు 41 మందికి రూ.2 కోట్లు ఇచ్చామని తెలిపారు. బంగారు ఆభరణాలపై రూ.50 లక్షలు, వ్యవసాయ రుణాలు రూ.7 కోట్లు ఇచ్చామన్నారు. 2020-21 ఆర్థిక సంవత్సరానికి 1500 రుణ గ్రహీతలకు 15.37 లక్షలు వడ్డీ రాయితీ వచ్చినట్లు చెప్పారు. సభ్యుల షేరుధనంపై ఆరు శాతం డివిడెండు రూ.4 లక్షలు వచ్చిందని, త్వరలోనే సభ్య రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బోర్డు డైరెక్టర్ పి.కాశి, వేతన కార్యదర్శి ఎన్ శాంతి, సిబ్బంది లక్ష్మణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్- కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, ఫీజుల దోపిడీ నివారించాలని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు కోన లక్ష్మణ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీ, విద్యా శాఖ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహణ, అర్హత అనుభవం లేని అధ్యాపకులతో బోధన, అనుమతులు లేకుండా కోచింగ్ సెంటర్ల నిర్వహణ వంటివాటిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. విద్యా వ్యాపారం కాకుండా ఫీజుల దోపిడీని అడ్డుకోవాలని, పిల్లల భద్రత రక్షణకు భరోసా ఇవ్వాలని లక్ష్మణ డిమాండ్ చేశారు.

అక్రమ కట్టడాల తొలగింపు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని వెదుళ్ల నరవ సర్వే నెంబర్ 98 ప్రభుత్వ వాగు పోరంబోకులో అక్రమ నిర్మాణాలను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు ఆర్ఐ వీరయ్య తెలిపారు. వాగు పోరంబోకు భూమిని గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమణకు పాల్పడి, అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు వాటిని తొలగించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ,విఆర్ఏ,టౌన్ ప్లానింగ్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా రాధ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బి.రాధ బుధవారం బాధ్యతలు చేపట్టారు. విశాఖపట్నం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా బుధవారం తారువలోని డిప్యూటీ సీఎం క్యాంప్ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి సాలవుతో సత్కరించి అభినందించారు.



డిప్యూటీ సిఎంను కలిసిన జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్

అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో హాల్ట్ కల్పించాలని

రైల్వే డిఆర్ఎంకు సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అనకాపల్లి

విశాఖపట్నం- విజయవాడ ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో వారి ఇబ్బందులను తొలగించేందుకు ఎల్‌టిటి, ఫలక్‌నూమా, కోరమాండల్, వందేభారత్, దురంతో రైళ్లకు అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో హాల్ట్ కల్పించాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ డిఆర్ఎంకు సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రైల్వే డిఆర్ఎంకు రాసిన లేఖను బుధవారం ఆయన విడుదల చేశారు. అనకాపల్లి జిల్లా కేంద్రమైన తరువాత ప్రయాణ రాకపోకలు పెరిగాయని, రద్దీ ఎక్కువగా వుందని పేర్కొన్నారు. విశాఖపట్నం నుంచి అనకాపల్లి మీదుగా విజయవాడ వైపు వెళ్లే రైళ్లకు అనకాపల్లి రైల్వే స్టేషన్ వద్ద హాల్ట్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ తరగతుల ప్రజలు, వ్యాపారాలు చేసుకొనే వారు, ఉద్యోగులు సకాలంలో గమ్యానికి చేరుకోలేకపోతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం నుంచి అనకాపల్లి మీదుగా వెళ్తున్న ఎల్‌టిటి(18519), ఫలక్‌నూమా(12703), కోరమాండల్(12841), వందేభారత్ (20833), దురంతో(22203) రైళ్లకు అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో హాల్ట్ ఏర్పాటు చేసి ప్రయాణం సులభతరం చేయాలని కోరారు.

లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోనిపశువులకు ఈ నెల 1 నుండి 31 వరకు ఉచితంగా లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు స్థానిక పశుసంవర్ధక శాఖ ఎడి ఉషా కుమారి తెలిపారు. పాడి రైతులందరు తమ గ్రామాలలోని రైతు భరోసా కేంద్రంలో ఉండే పశు వైద్య సహాయకుని సంప్రదించి తమ వద్ద ఉన్న 4 నెలలు వయసు దాటిన ఆడ, మగ పశువులన్నిటికి టీకాలు వేయించుకోవాలని కోరారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-కశింకోట : రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని కశింకోట మండల వ్యవసాయ శాఖ అధికారి ఎమ్ స్వప్న అన్నారు. బుధవారం మండలంలోని నూతన గుండుపాలెం, జట్టుపురెడ్డి తుని రైతు భరోసా కేంద్రాల పరిధిలో వరి పొలాలు సందర్శించారు. కార్యక్రమంలో సహాయకులు మధు, స్వాతి పాల్గొన్నారు.

సబ్బవరం : ఖరీఫ్ సీజన్లో రైతులు వేసుకునే పంటలకు కచ్చితమైన సమాచారంతో ఈ- పంట ద్వారా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు తెలిపారు. మండలంలోని అసకపల్లి పంచాయితీ శివారు ఎరుకు నాయుడుపాలెం గ్రామంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా జరుగుతున్న ఈ-పంట నమోదును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ-క్రాప్‌లో పంటల వివరాల నమోదు వల్ల ఉచిత పంటల బీమా పథకం, ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టపోతే పెట్టుబడి రాయితీ, పండిన పంటను ఆర్బికేల ద్వారా ధాన్యం కొనుగోలు మొదలైన అన్ని రకాల ఉపయోగాలు ఉంటాయని తెలిపారు. సోయిల్ కన్జర్వేషన్ ఏడి మురళి, స్థానిక వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు అలేఖ్య, హరీష్, పాల్గొన్నారు.

బీసీలను విస్మరించిన వైసిపి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : బీసీలను విస్మరించిన వైసీపీని రానున్న ఎన్నికలలో ఓడించాలని తెలుగు మహిళా జిల్లా విభాగం అధ్యక్షురాలు ఆడారి మంజు పిలుపునిచ్చారు. మండలంలో తిమ్మరాజుపేట, హరిపాలెం గ్రామాలలో మహాశక్తి చైతన్య రథయాత్ర కార్యక్రమాన్ని ఆమె ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటింటికి తిరిగి ఓటర్లను కలిశారు. భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. మాజీ జడ్పిటిసి రాజాన నారాయణమ్మ, తెలుగు మహిళ నాయకులు పిల్లా వరలక్ష్మి, ఊడి పుష్పలత, లాలం శాంతి, ఆడారి జానకి, తిమ్మరాజుపేట సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో 104 వైద్య శిబిరం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లి గ్రామ సచివాలయంలో బుధవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. దీనినిసర్పంచ్ కాండ్రేగుల నూకరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 వైద్య సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిహెచ్‌సి వైద్యురాలు ప్రవల్లిక వైద్య సేవలు అందించారు. ఏఎన్ఎం రమణి, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంతీయ పాస్‌పోర్టు సేవా కేంద్రం ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో కేంద్రంలో ప్రాంతీయ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాన్ని (పిఎస్‌కే) ఏర్పాటు చేయాలని అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి.సత్యవతి కేంద్ర విదేశాంగ మంత్రి జయశంకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె బుధవారం వినతిపత్రం అందజేశారు. 2022 ఏప్రిల్ 4న అనకాపల్లి నూతన జిల్లాగా ఏర్పాటైనట్లు చెప్పారు. అనకాపల్లిలో పాస్‌పోర్టు సేవా కేంద్రం లేకపోవడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వేగంగా పెరుగుతున్న జనాభా, వాణిజ్యం, పర్యాటక అవకాశాలను పరిగణనలోకి తీసుకుని, పాస్‌పోర్ట్ సేవలకు గణనీయంగా డిమాండ్ పెరిగిన నేపథ్యంలో అనకాపల్లిలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పిహెచ్‌సి అదనపు భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- సబ్బవరం : సబ్బవరం పిహెచ్‌సిలో అదనపు బ్లాకు నిర్మాణానికి బుధవారం స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పీహెచ్‌సి అభివృద్ధి కోసం నాడు- నేడు కార్యక్రమంలో భాగంగా కోటి రూపాయల నిధులతో కార్యక్రమాలు చేపట్టినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు మధ్యలోనే ఆపివేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం మరో 50 లక్షలు అదనంగా హెచ్చించి అదనపు వసతులతో పాటు కొత్తగా బ్లాక్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. సబ్బవరం పిహెచ్‌సిని సిహెచ్‌సిగా మార్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ బోకం సూర్య కుమారి రామునాయుడు, జెడ్‌పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, వైస్ ఎంపీపీ శరగడం ఝాన్సీ లక్ష్మీరాణి రాము, ఎంపీటీసీలు రాపేటి అరుణ రాము, బైలపూడి దేముడుబాబు, వైసీపీ నేతలు సబ్బవరపు నారాయణమూర్తి, సబ్బవరపు ముత్యాల నాయుడు, కర్రి బాబు, వనం అచ్చం నాయుడు, కాపుశెట్టి శేషు బాబు, బొడ్డేటి మహాలక్ష్మి నాయుడు, సబ్బవరపు నాగభూషణం, బుజ్జి, యర్ర శ్రీనివాసరావు, డి.పద్మావతి, బంతి కోళ్ల పద్మ, టి.శేఖర్, చిత్రాడశ్రీను, యర్రంశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్)లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసి గ్రూప్‌లలో ప్రవేశాలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్థానిక అయ్యన్న స్కూల్, జూనియర్ కాలేజీ స్టడీ సెంటర్స్ ఎఐ కో-ఆర్డినేటర్ డాక్టరు ఖాశీం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి ఆగస్టు 31వ తేదీ లోపు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు తమ స్టడీ సెంటర్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో వచ్చి ప్రవేశం పొందాలని డాక్టర్ ఖాశీం కోరారు.

కెవిఆర్ ట్రావెల్ బస్సు టైర్ పంక్చర్

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని నర్సింగబిల్లి జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుండి విశాఖపట్నం వస్తున్న కెవిఆర్ ట్రావెల్ బస్సు ముందు టైర్ పంక్చర్ అయింది. దీంతో అదుపు తప్పి డ్రైనేజీ దాటి, ఎస్-ఎస్.మాల్ నుండి మినకుర్తి వాసు ఇంటి వరకు వచ్చి ఆగింది. అందులోని ప్రయాణికులుకు స్వల్పంగా గాయాలయ్యాయి. పెద్ద ప్రమాదం తప్పింది. పగలు అయితే ప్రాణ నష్టం జరిగి ఉండేది. ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి సంఘటన స్థలం నుంచి బస్సును తీసి వేయించారు.

పింగళికి ఘన నివాళి



బయ్యవరంలో నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

జాతీయ జెండా రూపకర్త, శిల్పి పింగళి వెంకయ్య జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల ఆయన చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

మునగపాక రూరల్ : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామీణ గ్రంథాలయంలో స్థానిక గ్రంథాలయ అధికారి కోటేశ్వరరావు పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింగళి వెంకయ్యతో కలసి ఉద్యమంలో పాల్గొన్న గాడిచర్ల సర్వోత్తమరావు, వావిలాల గోపాలకృష్ణయ్య, అయ్యంకి వెంకటరమణ గ్రంథాలయ ఉద్యమకారులుకావడం మన అందరికీ గర్వకారణమని తెలిపారు.

కశింకోట : మండలంలో బయ్యవరంలో పింగళి వెంకయ్య 146వ జయంతి వేడుకలు ఉగ్గిన గంగునాయుడు సేవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి గొంతిని శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణామూర్తి పింగళి వెంకయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నైనంనంశెట్టి రమణారావు, మాజీ సర్పంచ్ లు కర్రి దుర్గునాయుడు, చిదిరెడ్డి శ్రీను, బుదిరెడ్డి గంగయ్య, జెర్రిపోతుల నూకునాయుడు, డీసీసీబీ డైరెక్టర్ అంద్ర ప్రసాద్, శెట్టిపల్లి అప్పలనాయుడు, గుమ్మల మాణిక్యం పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్ : స్థానిక ఐదు రోడ్ల జంక్షన్‌లోని శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ పి.దమయంతి ఆధ్వర్యంలో జరిగిన పింగళి జయంతి కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్రాంత లైబ్రేరియన్ కె.త్రిమూర్తులు పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ, ఒక తెలుగువాడు జాతీయ జెండాను రూపకల్పన చేయడం మన అందరికీ గర్వ కారణమన్నారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు పి.ప్రభాకర్, లైబ్రేరియన్ పి దమయంతి మాట్లాడారు.

నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లులో గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పలరాజు, సిబ్బంది రమణమ్మ, విద్యార్థులు ,పాఠకులు పాల్గొన్నారు .

మాడుగుల : పింగళి వెంకయ్య జయంతి వేడుకలు బుధవారం మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శాస్త్రి మాట్లాడుతూ, విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్ జయలక్ష్మి, అధ్యాపకులు రామ్ కుమార్, పైడి రాజు, రాజు, షర్మిల, సులోచన, నారాయణ, రమణ మూర్తి,శిరీష, షర్మిల శ్రీ, ప్రసాదరావు, నాగేశ్వరరావు, బోధ నేతర సిబ్బంది సులేమాన్, శ్రీనివాసరావు పాల్గొన్నారు

ఆనందపురం : మండలంలోని నీళ్లకుండీలు జంక్షన్ వద్ద ఉన్న శ్రీసాయి స్వామి వివేకానంద పాఠశాలలో జాతీయ జెండా సృష్టికర్త పింగళి వెంకయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి, దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎలిపే బంగార్రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ



కిట్ పంపిణీ చేస్తున్న ధర్మశ్రీ

ప్రజాశక్తి-యంత్రాంగం

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ టేక్ హెూమ్ కిట్లను గర్భిణులు, బాలింతలకు అనకాపల్లి, విశాఖ జిల్లాలో బుధవారం అందజేశారు. ఈ కిట్లను ఇంటింటికి అందజేస్తారని అధికారులు నాయకులు తెలిపారు.

కొత్తకోట:వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ టేక్ హెూమ్ కిట్లలో ఎంతో పోషకాలతో కూడిన ఆహారం ఉందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను బుధవారం పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి బాలింత, గర్భిణిల ఇంటికే మూడు కేజీల బియ్యం, కెజీ బెల్లం, 25 గుడ్లు, 4 లీటర్ల పాలు, ఆరకేజీ నూనె, కెజి రాగి పిండి, శనగ అచ్చులు, ఎండు ఖర్జూరం వంటివి ఈ కిట్లలో ఉంటాయన్నారు.ఆంగన్వాడీ కార్యకర్తలు ఈ కిట్లను గర్భిణి, బాలింతల ఇంటికి వెళ్లి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పైల రాజు, మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాదరావు, వైస్ ఎంపిపి దంట్ల వెంకట రమణ, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బంటు సన్యాసినాయుడు, ఎంపిటిసి ఫ్లోర్ లీడర్ పూడి దేవ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గంటా ఈశ్వరరావు ఐసిడిఎస్ పివో ఉషారాణి పలువురు పాల్గొన్నారు.

గొలుగొండ:టేక్ హోమ్ రేషన్ పథకాన్ని గర్భిణీలు, బాలింతలు సగ్వినియోగం చేసుకోవాలని గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు సూచించారు. మండల కేంద్రంలో వైయస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు అవస్థలు పడకుండా వాళ్ల ఇంటికి పట్టుకెళ్ళి పోషకాహారం అందించే విధంగా చూడడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డేవిడ్రాజు, మండల వైసిపి అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, మండల వైసిపి ప్రధాన కార్యదర్శి పత్తి రమణ, గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు, సిడిపిఒ శ్రీగౌరి, సూపర్వైజర్ ఐ.సత్యవతి, కె.సత్య, పివి.రాఘవ, ఎ.విజయలక్ష్మీ, నాగజ్యోతి, కె.సూర్యప్రభ, బిపిఎల్ కిరణ్, అంగన్వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

అనకాపల్లి : తల్లీ బిడ్డలు సంపూర్ణమైన ఆరోగ్యంతో ఉండేందుకు ప్రభుత్వం వారి ఇంటి వద్దకే పౌష్టికాహారం పంపిస్తుందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె.అనంతలక్ష్మి తెలిపారు. పట్టణంలోని గుండాల వద్ద గల సచివాలయాల సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పి వైస్ చైర్పర్సన్ బి.వరాహసత్యవతి, ఎంపీపీ గొర్లె సూరిబాబు, వైసిపి నాయకులు దిలీప్ కుమార్, గున్నయ్య నాయుడు, పెంటకోట జ్యోతి పాల్గొన్నారు.



అనకాపల్లిలో..

మండలంలోని పాపయ్య సంతపాలెం అంగన్వాడీ కేంద్రంలో వైయస్సార్ సంపూర్ణ పోషణ టేక్ ఏ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమంలో ఎంపిపి గొర్లి సూరిబాబు, ఐసిడిఎస్ పిఓ శశికళ, మండల కోఆప్షన్ సభ్యులు బొండా అప్పలరాజు, సర్పంచ్ అన్నం చెళ్ళయమ్మ అప్పారావు, పసుపులేటి రామకృష్ణ, మోహనరావు, కోరుకొండ శ్రీనివాసరావు, అప్పారావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : గర్భిణులకు ఇంటి వద్దకే పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం గర్భిణులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార వర్మ, ఎంపిపి కోన సంధ్య బుజ్జి, సర్పంచ్ కె విమల నాయుడు, కో ఆప్షన్ సభ్యుడు నర్మల కుమార్, వైసిపి నాయకులు దేశంశెట్టి శంకర్రావు, ఎంపీడీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం నెంబర్-2 పాఠశాల వద్ద గల అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు టేక్ ఏ హోమ్ సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్పిటిసి లగిశెట్టి భవానీ, వైసిపి నాయకులు లగిశెట్టి గణేష్, ఇందలి ముసలి నాయుడు, గుమ్మడి నారాయణరావు, చిన్ని రాజీవ్, అంగన్వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, అమ్మాజీ, బొర్రమ్మ, రామలక్ష్మి, ఉమా, సత్యవతి పాల్గొన్నారు.

మధురవాడ : గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను అధి గమించేందుకు మహిళా శిశు సంక్షేమశాఖ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని 7వ వార్డు కార్పొరేటర్ పిళ్ళా మంగమ్మ బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో పిళ్ళా వెంకటరావు, నాగోతి శ్రీను, పిస చిన్నారావు సిబ్బంది పాల్గొన్నారు.

పిఎం.పాలెం : కొమ్మాది సమీపంలో ఉన్న అంగన్వాడీ కేంద్రం ద్వారా ఇంటివద్దకే వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ రేషన్ పంపిణీ చేపట్టారు. 20 మంది బాలింతలు, 32 మంది గర్భిణులకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ రేషన్ కిట్లను వైసిపి ఆరో వార్డు అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, గుంటుబోయిన సంజీవ్ యాదవ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త నాగమణి, సచివాలయం ఎఎన్ఎం విజయ, ఆశ వర్కర్ పార్వతి, సచివాలయం మహిళా పోలీస్ పాల్గొన్నారు.

పెందుర్తి : 95వ వార్డు పరిధి వరలక్ష్మినగర్ అంగన్వాడీ కేంద్రం పరిధిలో కార్పొరేటర్ ముమ్మన దేముడు ద్వారా గర్భవతులు, బాలింతలకు 10 రకాల పోషకాహార సరుకుల కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గంట్ల నర్సింహామూర్తి, బొడ్డు దేముడుబాబు, అంగటి సూరిబాబు, పువ్వాడ త్రినాథ్, భాగ్యలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

తగరపువలస : గర్భిణిలకు అంగన్వాడీ కేంద్రం నుంచి ఇంటికే సరుకులు పంపిణీ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. భీమిలి మండలం టి.నగరపాలెంలో ఎంపిపి దంతులూరి వాసురాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొట్నూరు చాయా గౌతమి, ఎంపిటిసి పల్లా నీలిమ, వైసిపి నాయకులు చంద్రశేఖర్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహార సరుకులు అందజేస్తున్న ఎంపిపి వాసురాజు

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

-పలు చోట్ల తల్లిపాల వారోత్సవాలు



మంగళాపురంలో ర్యాలీ చేపడతున్న సర్పంచ్, సిబ్బంది

ప్రజాశక్తి- వడ్డాది: తల్లిపాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి లోవరాజు తెలిపారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది, చిన్న అప్పన్న పాలెం అంగన్వాడి కేంద్రాల్లో ఐసిడిఎస్ పిఓ ఉషారాణి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ, బిడ్డ పుట్టినప్పటి నుండి మూడు సంవత్సరాల పాటు తల్లిపాలు క్రమం తప్పకుండా అందించాలని తెలిపారు. తల్లి పాలతోనే పిల్లలకు అధిక పోషకాలు లభిస్తాయన్నారు.

మంగళాపురం అంగన్వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంటే పద్మరేఖ, ఎఎన్ఎం రమణమ్మ, ఎంఎల్హెచ్పి రేవతి, మహిళా పోలీస్ మహాలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త కెవిఎస్ రాధ, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

దేవరాపల్లి : తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని, రెండేళ్ల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే తాగించాలని జడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో బుధవారం జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణీలు, బాలింతలతో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ వేచలం సెక్టార్ సూపర్వైజర్ జి. ఆదిలక్ష్మి, వైద్యాధికారి ఎస్ లలిత, పంచాయతీ సెక్రెటరీ కే సుధాకర్ బాబు, సూపర్వైజర్ బేబీ రాణి, ఏఎన్ఎంలు కె. విజయలక్ష్మి, హైమ, ఎంఎల్ హెచ్ పి పద్మ పాల్గొన్నారు.

సింహాచలం: సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్నాయక్ ఆధ్వర్యాన తల్లిపాలు వారోత్సవాల నేపథ్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాణి, ఆర్.ఝాన్సీరాణి, ఎన్.యలమదేవి, నరసింహారావు, గోపాలకృష్ణ, కె.కిషోర్, పార్వతీశం, దేవుడమ్మ, నరసమ్మ పాల్గొన్నారు.

నక్కపల్లి:తల్లిపాలలో మెండైన పోషకాలు లభిస్తాయని ఐసిడిఎస్ సిడిపిఓ ఎం విద్య తెలిపారు. నక్కపల్లి తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు, అంగన్వాడి టీచర్లు ర్యాలీ నిర్వహించారు. ఈనెల 7వ తేదీ వరకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు లలిత, తులసి, హైమావతి, దుర్గ, నిషా పాల్గొన్నారు.



నక్కపల్లిలో చేపడుతున్న ర్యాలీ



తనిఖీ నిర్వహిస్తున్న సభ్యులు

ఫుడ్ కమిటీ సభ్యుల తనిఖీలు

ప్రజాశక్తి-మాడుగుల:ఆహార సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.కాంతారావు, ఇతర అధికారులు బుదవారం మాడుగులలో పలు పాఠశాలలు, అనాన్వాడి కేంద్రాలను తనిఖీ చేశారు. అంగన్వాడి కేంద్రాల్లో, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు.సమయానికి హాజరు కాకపోవడంతో ఐసిడిఎస్ పిఓ శ్రీదేవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారి రవి కుమార్, మధ్యాహ్న భోజన పథకం అధికారి శ్రీనివాసరావు, లీగల్ మెట్రాలజి అసిస్టెంట్ కంట్రోలర్ రామచంద్రయ్య, సిఎస్డిటి ఈశ్వరరావు, ఏఎస్ఓ కల్యాణి, అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశాఖకు వెళ్లి పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-రావికమతం:విశాఖ కేజీహెచ్లో చికిత్స పొందుతున్న ఇద్దరికి వాలంటీరు పింఛన్లు అందజేశారు. మండలంలో కవగుంట గ్రామానికి చెందిన పింఛను దారులు చేపూరి వరహాలమ్మ (వితంతు), సమాల తరుణ్ కుమార్ (వికలాంగుల) లు విశాఖ కేజీహెచ్లో చికిత్స పొందుతున్నారు.



అసుపత్రిలో పింఛను ఇస్తున్న వాలంటీర్

వాలంటీరు పరవాడ రమణ కేజీహెచ్కు వెళ్లి వారికి పింఛన్లు అందజేశారు. ఈ మేరకు కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి వాలంటీర్ను అభినందించారు.

ఆర్ఎంపిలే దిక్కు

ప్రజాశక్తి-మాడుగుల:అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా ఆర్ఎంపి వైద్యుల సేవలు అందిస్తూ ప్రజల ప్రాణాలు కాపాడుతున్నారు. చిన్న,చిన్న వైద్యం చేస్తూ అందరికీ అందుబాటు లో వుంటున్నారు.మండల కేంద్రంలో పలు ఆసుపత్రులు వున్నాయి. అయితే, రాత్రి సమయాల్లో మాత్రం అంతంత మాత్రమే. ఆసుపత్రులు తెరిచే వున్నా వైద్యులు ఆ సమయానికి అందుబాటు లో వుండరు. ప్రభుత్వ ఆసుపత్రిలో రాత్రి సమయంలో వెళితే కనీస తీవ్ర జ్వరం కేసులు సైతం వైద్యం చేయక చేతులెత్తేసిన సంఘటనలు అనేకం వున్నాయి.అనేక కేసులను రిఫర్ చేసే పరిస్థితులు ఎక్కువ వున్నాయి.ఈ నేపథ్యంలో ప్రైవేట్ ఆర్ ఎం పి వైద్యులు మాత్రం ఏ సమయంలో అయినా అందుబాటులో వుంటూ సేవలు అందిస్తున్నారు. ఫీజులు కూడా నామ మాత్రంగా వసూలు చేయడం విశేషం. మండలంలోని అనేక గ్రామాలలో సైతం పలువురు ఆర్ఎంపి వైద్యులు వైద్యాన్ని అందిస్తూ ప్రజలకు సహాయ పడుతున్నారు

పాదయాత్రను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-గొలుగొండ:రాష్ట్రంలో షెడ్యూల్ ఏరియాలో చేర్చేందుకు గుర్తించిన ఆదివాసీ గ్రామాలను 5వ షెడ్యూల్ ప్రాంతంగా ప్రకటించాలనే డిమాండ్తో పాదయాత్ర చేస్తున్నామని ఏపి ఆదివాసీ హక్కుల సాధన సంఘం (ఏపిఎహెచ్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షులు యన్.కళ్యాణ్ తెలిపారు. బుధవారం మండలంలోని నల్లంకి గ్రామంలో ఈ నెల 4వ తేది నుండి 7వ తేదీ వరకు నర్సీపట్నం నుండి అనకాపల్లి వరకు నాలుగు రోజులు పాదయాత్ర అఖిల భారత ఆదివాసీ సంఘం (ఏఎస్ఎం) ఏపి ఆదివాసీ హక్కుల సాధన సంఘం (ఏపిఎహెచ్ఎస్ఎస్) సంయుక్తంగా పియస్.అజయ్కుమార్ ఆధ్వర్యాన చేయనున్నామన్నారు. నాన్ షెడ్యూల్ ఏరియా ఆదివాసీ గ్రామాలు విభజిత ఆంధ్రప్రదేశ్లో షెడ్యూల్ ఏరియాలో చేర్చేందుకు గుర్తించిన 579 రెవిన్యూ గ్రామాలు ఉన్నాయన్నారు. వీరు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. 14వ తేదీన విజయవాడ ధర్నా చౌక్లో ఒకరోజు నిరవదిక దీక్ష కూడా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వాడపల్లి సంజీవ్, ఏఐఎం డివిజన్ కార్యదర్శి కె.మల్లేశ్వరరావు, అప్పారావు, లోవరాజు, కంఠారం సర్పంచ్ మల్లేష్, వార్డు మెంబర్ సాగర కొండబాబు పాల్గొన్నారు.



భోజనం రుచి చూస్తున్న ఉదయశ్రీ

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం డిఎల్‌డిఓ ఉదయశ్రీ సందర్శించారు. విద్యార్థుల అభ్యసన సామర్ధ్యాలను పరిశీలించారు. పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులకు ఉపాధ్యాయులు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెరుగైన ఫలితాలు సాధనకు కృషి చేయాలన్నారు. బైజూస్ ట్యాబ్‌లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నూకరత్నం, హెచ్‌ఎం నర్సింగరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.



దీక్షను చేపడుతున్న గిరిజనులు

కొనసాగిన రిలే దీక్షలు

ప్రజాశక్తి-కోటవురట్ల:అణుకు గ్రామానికి పాఠశాల, రహదారి సౌకర్యం కల్పించాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 27వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న గిరిజనులు, సిపిఎం నాయకులు డేవిడ్‌రాజు మాట్లాడుతూ, గిరిజనుల సమస్యలు పరిష్కరించే వారకూ దీక్షలను విరమించేది లేదన్నారు.

విద్యా వాలంటీర్ నియామకానికి అంగీకారం

కోటవురట్ల:మండలంలో గొట్టువాడ శివారు అణుకు గ్రామానికి రహదారి, పాఠశాల సౌకర్యం కల్పించాలంటూ 27 రోజులుగా చేపడుతున్న దీక్షకు కంటి తుడుపు చర్యగా విద్యాశాఖ అధికారులు గ్రామంలో విద్యార్థులకు విద్యా వాలంటీర్ టీచర్ను నియమించేందుకు చర్యలు చేపట్టారు. నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి రూ.10 వేతనంతో నియమించేందుకు అధికారులు ఈనెల 5 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి రామారావు ప్రకటనలో పేర్కొన్నారు.



ప్రకృతి వనరుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న యశోద

రైతు వనరుల కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో కొండపాలెం గ్రామంలో ఆర్‌బికే వెటర్నరీ అసిస్టెంట్ యశోద ఆధ్వర్యంలో గెంజి లోవమ్మ అనే మహిళా రైతుతో రైతుల వనరుల శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతుల వనరుల శిక్షణ ఉద్దేశ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీ బి.దేవి, జ్యోతి, మోడల్ మేకర్ రామకృష్ణ, మోదినాయుడు, ప్రకృతి వనరుల సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్ వాసులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి- కలెక్టరేట్: మణిపూర్‌లో మహిళలు, క్రైస్తవులపై దాడులను అరికట్టి, వారికి రక్షణ కల్పించాలని క్రైస్తవుల సమైక్యత సమాజం, క్రైస్తవ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు.. అనంతరం ఎల్‌ఐసి అంబేద్కర్ విగ్రహం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్ డానియల్ పాల్, యూత్ అధ్యక్షుడు పి. చిన్న , మహిళా అద్యక్షురాలు ఎన్.నిర్మల, నగర అధ్యక్షుడు ఆర్.విక్టర్ సాల్మన్ రాజు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుతున్న అత్యాచారాలు, హత్యలను ఖండిస్తూ నర్సీపట్నంలో అఖిలపక్షాల ఆద్వరంలో బుధవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం ప్రాంగణంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బొట్టా నాగరాజు అధ్యక్షత వహించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అఖిల పక్ష నాయకులు మాట్లాడుతూ, మణిపూర్ సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. దౌర్జన్యాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో మన రాష్ట్రంలో ఉన్న వైఎస్ఆర్, తెలుగుదేశం, జనసేన పార్టీలకు ప్రజలు ఓట్లు వేస్తే అది బిజెపికి వేసి నట్టే అవుతుందన్నారు. బిజెపి ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న ఈ పార్టీలకు ప్రజలు ఓట్ల ద్వారా బుద్ధి చెప్పాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పిసిసి నెంబర్ మీసాల సుబ్బన్న, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామనాయుడు, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ నాయకులు అడిగర్ల రాజు, ప్రజాబంధు పార్టీ నాయకులు ప్రసాద్, పాల్, ఐద్వా నాయకులు ఎల్.గౌరీ, సూర్య ప్రభ, బహుజన్ ఐక్యవేదిక నాయకులు గంగాధర, రైతు సంఘం నాయకులు మేకా సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కొండలరావు, సూరిబాబు, అప్పలనాయుడు, గిరిబాబు, సూరిబాబు పాల్గొన్నారు.



నర్సీపట్నంలో దీక్ష చేపడుతున్న నాయకులు

సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులేవీ ?

ప్రజాశక్తి-చీడికాడ:మాడుగుల నియోజకవర్గంలో దేవరాపల్లి, రైవాడ, కోణం, పాలవెల్లి జలాశయం, తాచేయరు జలాశయాల ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులు ఎందుకు కేటాయించలేదని, రైతులు నష్టపోతున్నా ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఎందుకు పట్టించుకోలేదని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ప్రశ్నించారు. మండలంలోని అప్పలరాజుపురం గ్రామంలో ఆయన స్వగృహం వద్ద కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సాగునీటి ప్రాజెక్టులకు అధిక మొత్తంలో నిధులు వెచ్చించి అభివృద్ధి చేశామని తెలిపారు. రైతులకు సకాలంలో సాగు నీరు అందేలా చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులను, వ్యవసాయ అభివృద్ధిని పక్కనపెట్టి రైతుల నడ్డి విరుస్తుందని గవిరెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు కపట మాటలు చెప్పి రాష్ట్ర సుస్థిర అబివృద్ధిని తుంగలో తొక్కి రాజ్యమేలుతున్నారని, ఇదేనా రాష్ట్ర అభివక్ష్మిద్ధి అని రామానాయుడు ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 8న మాడుగుల నియోజకవర్గంలో పర్యటిస్తారని, ప్రజలందరూ తప్పక ఆదరించాలని రామా నాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు పోతల చిన్నం నాయుడు, మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, ఎంపీటీసీలు పెద్ది నాయుడు, ముత్యాలనాయుడు, మాజీ సర్పంచ్ దాలినాయుడు, సూర్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామానాయుడు

పాడి పశువులకు లంపీ స్కిన్ టీకాలు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : పాడిపశువులకు ఉచిత లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాలను ఈనెల 31వ తేదీ వరకూ వేస్తామని, పాడి రైతులు వినియోగించుకోవాలని నర్సీపట్నం పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డబ్ల్యు రాంబాబు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గత సంవత్సరం తెల్లజాతి పాడి పశువులకు లంపి స్కిన్ వ్యాధి తీవ్రంగా నష్టపరిచిందని,ముందస్తుగా పాడి పశువులకు లంపి స్కిన్ వ్యాధి నిరోధక టీకాలను వేయించుకోవాలన్నారు. రైతులందరు తమ గ్రామాలలోని రైతు భరోసా కేంద్రంలో పశు వైద్య సహాయకులను సంప్రదించాలన్నారు. నర్సీపట్నం మండలానికి 2800 డోసులు, గొలుగొండ మండలానికి 5500 డోసులు పంపిణీకి సిద్ధంగా వున్నట్లు తెలిపారు. పాడి రైతులు వ్యాధి సోకిన పశువులను సంతలు, గ్రామాలలోకి తీసుకు రాకుండా జాగ్రతలు తీసుకుంటే ఈ వ్యాధి ప్రబలకుండా చేయవచ్చని సూచించారు. పశువులకు దద్దుర్లు, జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే పశు వైద్యాధికారులను సంప్రదిస్తే తక్షణం వైద్యం అందించాలని సూచించారు.



మాట్లాడుతున్న రాంబాబు

మణిపూర్‌లో ఆదివాసీలపై హింసాకాండను నిరసిస్తూ..

నేడు మన్యం బంద్

ప్రజాశక్తి-యంత్రాంగం

మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ.. తీవ్రంగా ఖండిస్తూ.. ఆ రాష్ట్రంలోని బిరేన్ సింగ్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి గిరిజన సంఘాలు సంయుక్తంగా ఈనెల 3న గురువారం మన్యం బంద్ చేపట్టనున్నాయి. అల్లూరి జిల్లాలో బంద్‌ను నిర్వహించేందుకు పలు గిరిజన సంఘాలు సమాయత్తమయ్యాయి. ఈ మేరకు జిల్లాలో విస్తృతంగా బుధవారం ప్రచారం చేపట్టాయి

పాడేరు: జిల్లా వ్యాప్తంగా ఆదివాసి గిరిజన సంఘం గిరిజన సమాఖ్య డిఎల్‌ఓ అనుబంధ సంఘాలు ఎస్‌ఎఫ్‌ఐ ఏఐఎస్‌ఎఫ్, సిఐటియు, పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, కార్మిక, సంఘాలు బంద్‌లో పాల్గొననున్నాయి.గత రెండు రోజులుగా జిల్లాలో బంద్ నిర్వహణపై అన్ని వర్గాల ప్రజలకు సమాచారమిచ్చి స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని గిరిజన సంఘాలు పిలుపు నిచ్చాయి. బంద్ నిర్వహణపై బుధవారం పాడేరు జిల్లా కేంద్రంలో ఆదివాసి గిరిజన సంఘం, గిరిజన సమాఖ్య నేతలు ఆర్టీసీ డిపో మేనేజర్, బ్యాంక్ మేనేజర్లు విద్యా సంస్థలు, వర్తక వ్యాపార, వాణిజ్య సంస్థల్ని ప్రత్యేకంగా కలిసి బంద్‌కు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎల్ సుందర్రావు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మువ్వల లక్ష్మణరావు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ నాయకులు చిన్నారావు, బొజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.



అరకులో బైక్ ర్యాలీ చేపడతున్న నాయకులు

అరకులోయ రూరల్:మణిపూర్ ఆదివాసులపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు, అత్యాచారాల నిరసిస్తూ చేపట్టే బంద్‌ను విజయవంతం చేయాలని అరకువేలిలో ఆదివాసీ గిరిజన సంఘం, దండ కారణ్య విమోచన సమితి, ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడారు.ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి పి రామన్న, మండల ఉపాధ్యక్షులు బి.దశరథ, ఉపాధ్యక్షులు కె రామారావు, దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర జిల్లా నాయకులు కొర్ర ప్రసన్నకుమార్, జాన్ బాబు, రమేష్ కుమార్, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు మధు, మార్కండే, అప్పలస్వామి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి:మన్యం బంద్‌లో ఉద్యోగ, ప్రజా సంఘాలు రాజకీయాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ ప్రచారం చేపట్టారు. జెడ్పిటిసి దీసరి గంగరాజు, సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు బృందాలుగా ఏర్పడి ప్రచారం చేశారు. జెడ్పిటిసి గంగరాజు బృందం అనంతగిరి, ములియగుడ, బొర్రాగుహలు, డమ్ముకు వారపు సంతల్లో ప్రచారం చేశారు. మరో బృందం కాశీపట్నం వారపు సంతతో పాటు శివలింగపురం, కొత్తూరు, చిలకలగెడ్డ ప్రాంతంలో వ్యాపార దుకాణాలు, హెూటల్స్ నిర్వాహకులను కలిశారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు సివేరి. కొండలరావు, మండల కమిటీ నాయకులు ఎం.కృష్ణ, జన్ని.రామన్న పాల్గొన్నారు

డుంబ్రిగుడ:మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలం కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో యూనియన్ బ్యాంకు, పెట్రోల్ బంక్, కిరాణా దుకాణాల్లో కరపత్రాలు పంచుతూ విస్తతంగా ప్రచారం చేపట్టారు. అరుకు, కించమండలో కూడా ప్రచారం నిర్వహించి ప్రైవేట్ వాహనదారులు బంద్ కు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్పీ పోతురాజు, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు టి సూర్యనారాయణ, పి.సురేష్, పి.సత్యనారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు:మహిళలపై జరుగుతున్న హింస కాండను ప్రతిఒక్కరు ఖండించాలని, మన్యం బందు విజయవంతం చేయాలనీ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మండల అధ్యక్షురాలు టి.కౌసల్య ఆధ్వర్యంలో గోడపత్రికలు ఆవిష్కరించారు. అనంతరం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ, ఆదివాసీ మహిళలపై రోజు రోజుకు హింసాకాండ పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌనంగా ఉన్నాయన్నారు.మహిళలను హింసిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.